సాక్షి
గుంటూరు
మంగళవారం । 30 । జూలై । 2024



విద్యార్థికి అభినందనలు

బాపట్ల: పదో తరగతిలో 573 మార్కులు సాధించిన బాపట్ల సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థి చేబ్రోలు అరవింద్‌ను కలెక్టర్ వెంకట మురళి సోమవారం అభినందించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 505 క్యూసెక్కులు వదిలారు.



వైభవంగా పవిత్రోత్సవాలు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆడి కృత్తిక పవిత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి.

న్యూస్‌రీల్

బంగారు తాపడం పనులకు రూ.5 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గుంటూరుకు చెందిన భక్తులు రూ.5 లక్షల విరాళం సమర్పించారు. గుంటూరుకు చెందిన ఎన్.సాయివీణ కుటుంబ సభ్యులు సోమవారం దుర్గమ్మ దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈఈ కె.వి.ఎస్.కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీన ఉదయం 10 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. పాలిసెట్ పరీక్ష రాయకపోయినా, స్పాట్ అడ్మిషన్స్‌లో పాల్గొనవచ్చన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్‌ల ద్వారా చేరవచ్చని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పదో తరగతి మార్కు ల జాబితా, నాలుగవ తరగతి నుంచి పదవ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్, ఒరిజినల్స్‌తోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో నేరుగా ఈనెల 31వ తేదీన నల్లపాడు గ్రామంలోని కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్‌లో పాల్గొని సీటు పొంది రూ.6500 ఫీజును తక్షణమే చెల్లించి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు.

యార్డుకు 40,891 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 40,891 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,353 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,500 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,400 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,748 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

164 ఆస్పత్రుల్లో స్కాన్ సెంటర్లకు అనుమతి

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ఇప్పటివరకు 164 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద స్కాన్ సెంటర్లకు అనుమతులు ఇచ్చామని వీరందరూ చట్టం ప్రకారం అన్ని రికార్డులు నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. నూతనంగా జిల్లాలో ఏడు స్కాన్‌సెంటర్ల కోసం, మూడు రెన్యువల్, ఎనిమిది మార్పుల కోసం దరఖాస్తులు అందజేశారని, తనిఖీలు నిర్వహించి కలెక్టర్‌కు నివేదించి ఆయన అనుమతితో లైసెన్స్‌లు మంజూరు చేస్తామని అన్నారు. సోమవారం పల్నాడురోడ్డులోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంబంధిత కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం-1994ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ చట్టం పరిధిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లింగనిర్ధారణ చేయటం చట్టరీత్యా నేరమని, చేసినట్లు రుజువైతే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.గీతాంజలి పాల్గొన్నారు.

కూర ఘాటు

మనిషి ఎంత కష్టపడినా జానెడు పొట్టకోసమే.. పొట్ట నింపుకోవడమే గగనమైతే.. ఇంత కూరతో గుప్పెడు మెతుకులూ తినలేని దుస్థితి తలెత్తితే.. ప్రస్తుతం పెరుగుతున్న కూరగాయల ధరలతో పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు పచ్చడి మెతుకులూ అందని దైన్యం నెలకొంది. మార్కెట్లో పచ్చిమిర్చి ధర ఆకాశాన్నంటింది. టమాటా.. బెండ, బీర తదితర కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి. ఫలితంగా పేదింటి కూరగిన్నె.. ధరల కాకతో వణుకుతోంది. కూరగాయల సాగు అమాంతం పడిపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది.

- ఠారెత్తిస్తున్న టమాటా, పచ్చిమిర్చి
- ఘాటెక్కుతున్న ఉల్లి
- జిల్లాలో తగ్గిన కూరగాయల సాగు
- జిల్లా సాధారణ విస్తీర్ణం 2,198 హెక్టార్లు.. సాగు 1,073 హెక్టార్లు
- పెరుగుతున్న కూరగాయల ధరలు

దడపుట్టిస్తున్న కూరగాయల ధరలు



గుంటూరులోని పట్టాభిపురం రైతుబజారులో కూరగాయలు

కొరిటెపాడు(గుంటూరు): భూగర్భ జలాలు అడుగంటిపోవడం, నెలక్రితం వరకూ తీవ్ర వర్షాభావం దృష్ట్యా జిల్లాలో కూరగాయల సాగు అమాంతం పడిపోయింది. ఫలితంగా కాయగూరల ఉత్పత్తి తగ్గిపోయింది. మార్కెట్లో కొరత వల్ల గిరాకీ పెరిగి ధరలు ఆకాశన్నంటుతున్నాయి.

మరో నెల వరకు ట'మాట' కష్టమే!

వేసవిలో టమాటా సాగుకు జిల్లాలో అనుకూల వాతావరణం లేకపోవడంతో రైతులు ఆసక్తి చూపలేదు. దీంతో మదనపల్లి, బెంగళూరు, అనంతపురం, కర్నూలు నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం రైతుబజారులో కిలో టమాటా ధర రూ.34 ఉండగా బయట మార్కెట్‌లో రూ.40 నుంచి రూ.50 పలుకుతోంది. స్థానికంగా పండించే పంట మార్కెట్‌లోకి రావడానికి మరో నెల ఆగాల్సిందే.

'ఉల్లి'క్కిపాటు

ఉల్లి ధర పెరుగుతోంది. రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లి పండించేది ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే. ప్రస్తుతం ఈ పంట కర్నూలు జిల్లాలోనూ లేదు. ఖరీఫ్‌లో ఇప్పుడిప్పుడే సాగు మొదలైనట్లు సమాచారం. మహారాష్ట్ర నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రైతు బజార్లలో కిలో ఉల్లి రూ.38 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. బయట ఇంకా ఎక్కువే.

జిల్లాలో తగ్గిన కూరగాయల సాగు..

జిల్లాలో ప్రతి సంవత్సరం వేసవి(మే, జూన్)లో విస్తారంగా కూరగాయల పంటలు సాగు చేసేవారు. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటడంతో ఈ ఏడాది సాగు అంతగా చేపట్టలేదు. జిల్లాలో కూరగాయల పంటల సాగు సాధారణ విస్తీర్ణం 2,198 హెక్టార్లు ఉండగా, ఈ ఏడాది జూన్ మాసం చివరిలో కురిసిన వర్షాలకు 1,073 హెక్టార్లలో టమాటా, వంకాయ, దొండ, బీర, మిర్చి, కాకర, బెండ, దోస వంటి పంటలు సాగు చేశారు. ఇవి అందుబాటులోకి రావటానికి మరో 15 నుంచి 20 రోజులు పట్టనుంది.

పట్టాభిపురం రైతుబజారులో కూరగాయల ధరలు ఇలా(కిలోకు రూపాయలలో)

టమాటా	34	దొండ	30
ఫ్రెంచ్ బీన్స్	64	బంగాళాదుంప	38
క్యాప్సికం	64	గోరుచిక్కుడు	38
మిర్చి	50	ఉల్లిపాయలు	40
క్యారెట్	52	దోస	20
వంకాయ	34	బీట్‌రూట్	38
కాకర	36	అల్లం	165
క్యాబేజి	36	బెండ	20

దిగుమతి చేసుకోవడం వల్లే

ప్రస్తుతం టమాట మదనపల్లి, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. బంగాళాదుంపలు ఆగ్రా, క్యారెట్ బెంగళూరు, ఢిల్లీ నుంచి, క్యాప్సికం బెంగళూరు, బీన్స్ హైదరాబాదు, బెంగళూరు నుంచి వస్తున్నాయి. మిగతా రకాలు స్థానికంగా లభ్యమవుతున్నా.. తీవ్రమైన కొరత నెలకొంది. అందువల్ల మరో 15 రోజులపాటు ధరలు ఇలాగే కొనసాగుతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఇసుక సరఫరాలో పారదర్శకత ఉండాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వం వినియోగదారులకు ఉచితంగా అందిస్తున్న ఇసుకను స్టాక్ పాయింట్‌ల నుంచి సక్రమంగా సరఫరా అయ్యేవిధంగా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక సరఫరా, నిల్వ, ఎక్కువ ధరకు విక్రయించడం సంబంధిత అంశాలను క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. అక్రమాలకు పాల్పడిన వారికి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పెనాల్టీలు, శిక్షలు విధించాలని తెలిపారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం, లింగాయపాలెం ఇసుక పాయింట్‌ల వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా రోడ్డు వేయడానికి రూ.13 లక్షలు కేటాయించామన్నారు. మైన్స్ అండ్ జియాలజీ శాఖ వారు ఇసుక తవ్వకాలకు గుర్తించిన కొల్లిపర మండలంలోని బొమ్మినివానిపాలెం, పిడపర్తివారిపాలెం, వల్లభాపురం, అత్తలూరి పాలెం, దుగ్గిరాల మండలంలోని పెదకొండూరు వద్ద ఉన్న ఇసుక రీచ్‌లను పదిరోజుల్లో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి నివేదిక సమర్పించాలన్నారు. మున్నంగి, తాళ్లాయపాలెం, లింగాయపాలెం, ఇసుక స్టాక్ పాయింట్‌ల వద్ద ఇంటర్నెట్ సీసీ టీవీల ఏర్పాటుకు విద్యుత్ అవసరమని, దీనిని అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశించిన ధరల ప్రకారం ఇసుక సరఫరా చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఆర్డీవో శ్రీకర్, జిల్లా మైన్స్ అండ్‌జియాలజీ అధికారి చంద్రశేఖర్, జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు అప్పగించవద్దు

మైనర్లు, తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ క్లాస్



మైనర్లు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: మైనర్లకు వాహనాలు అప్పగించవద్దని వారి తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్, నల్లపాడు పీఎస్ పరిధిలో పెద్దఎత్తున నాకాబందీ నిర్వహించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎక్కువ మంది మైనర్లు బైక్‌లపై ప్రయాణించడాన్ని డ్రైవ్‌లో గుర్తించారు. ఈ మేరకు సోమవారం నగరంపాలెం పోలీస్ కవాతు మైదానంలో ఇరవై మంది మైనర్లకు, వారి తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక క్లాస్ తీసుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని చెప్పారు. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే రెండు కుటుంబాల్లోనూ విషాదం నెలకొంటుందని పేర్కొన్నారు. ఎవరైనా పిల్లలకు వాహనాలు అప్పగిస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి భవిష్యత్‌కు మంచి బాటలు వేయాలని తెలిపారు. మోటారుసైకిళ్లు నడిపేటప్పుడు హెల్మెట్, కారు నడిపే సమయంలోనూ సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. వాహనాల పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, లైసెన్స్ లేకుండా వాహనం నడపొద్దని పేర్కొన్నారు. పశ్చిమ డీఎస్పీ మహేష్, సీఐలు మధుసూదనరావు (నగరంపాలెం పీఎస్), కె.శ్రీనివాసరావు (అరండల్‌పేట పీఎస్), వంశీధర్ (నల్లపాడు పీఎస్), ఆనంద్, వెంకటప్రసాద్ (ఎస్‌బీ) పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: వివిధ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వచ్చే వారి విజ్ఞప్తులను అధికారులు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఒక్క అర్జీ పరిష్కారం కోసం పదేపదే తిప్పుకోకుండా చూడాలని తెలిపారు. పరిష్కరించే క్రమంలో ఆలస్యమైతే అర్జీదారునికి వివరించి చెప్పాలన్నారు. పరిష్కారానికి అవకాశం లేని వాటిని వివరించి తెలపాలన్నారు. గత వారం ఇచ్చిన అర్జీలు పరిష్కారం కాకపోవడంతో పదేపదే వేదికను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. పెండింగ్ కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పారు. ఇసుక సరఫరాకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన 220 ఫిర్యాదులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పరిశీలించారు.

టిడ్కో ఇంటికి కనీస వసతులు లేవు



నాకు సుమారు 6 నెలల కిందట అడవితక్కెళ్ళపాడులో టిడ్కో ఇల్లు ఇచ్చారు. అక్కడ కనీసం కరెంట్‌గానీ, మంచినీటి వసతి, రోడ్లు ఏమీ లేవు. ఆ ఇంటిని నేను ఏమి చేసుకోవాలి? పేదలంటే మరీ ఇంత చులకన భావన తగదు. కనీస వసతులు కల్పించండి.

– డొక్కా జార్జ్, గుంటూరు

కోడిగుడ్డు సత్రంలో బీసీ హాస్టల్‌ను ప్రారంభించండి



తూర్పు నియోజకవర్గ పరిధిలోని కోడిగుడ్డు సత్రంలో బీసీ హాస్టల్ ప్రారంభిస్తే ఎంతో మందికి లబ్ధి చేకూరుతుంది. గతంలో ఎన్ని ఫిర్యాదులిచ్చినా స్పందనలేదు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అధికారులు ముందుకు రావాలని మనవి.

– సమీర్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి

వైజ్ఞానిక నవోదయం

మద్దిరాల నవోదయలో శాస్త్రీయ వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు



సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని సీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. జవహర్ నవోదయ విద్యా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే క్లస్టర్ స్థాయి శాస్త్రీయ, వైజ్ఞానిక పోటీలు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం ఏర్పాటయ్యాయి. రెండురోజుల నిర్వహించే ఈ పోటీల్లో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రదర్శన ఆడిటోరియంను ప్రారంభించగా, మరో అతిథి ధనలక్ష్మి గ్రూప్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎం.లింగయ్యచౌదరి వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితాన్ని, ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంచుకుని విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి ఆయా అంశాలను తెలిపి జాగృతం చేయాలన్నారు. క్లస్టర్ స్థాయి పోటీల్లో విజేతలైనవారు త్వరలో కేరళలో జరిగే ప్రాంతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన...

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, యానాం, తూర్పుగోదావరి -1, 2, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని జవహర్ నవోదయ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తరలిరావడంతో మద్దిరాల జేఎన్‌వీ ప్రాంగణం కళకళలాడింది. గణితం, కంప్యూటర్ సైన్స్, జీవ, రసాయన, సామాజిక, విజ్ఞానశాస్త్రాలు, ఎస్‌యూపీడబ్ల్యూ అంశాల్లో 57 నమూనాలను పోటీల్లో ప్రదర్శించారు. అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆయా ప్రాజెక్టులను ఎంతో ఆసక్తిగా తిలకించారు. పలు అంశాలపై రూపొందించిన ఆయా ప్రాజెక్టుల ప్రయోజనాలను విద్యార్థులు వివరించారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

జెడ్పీలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

గుంటూరు ఎడ్యుకేషన్ : గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఆదేశాలతో జెడ్పీలో రెండు షిఫ్ట్‌ల వారీగా పనిచేసే విధంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఈనెల 26న విడుదల చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా సోమవారం అవసరమైన సిబ్బందిని నియమించారు. జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత మండల, గ్రామస్థాయి అధికారులకు తెలియపర్చాల్సి ఉంది. సంబంధిత సమస్యలకు పరిష్కారాన్ని చూపించి, సదరు వివరాలకు ఫిర్యాదుదారునికి తెలియపర్చాలి. ఫిర్యాదుల పరిష్కార నివేదికను రిజిస్టర్ ప్రకారం కంప్యూటరైజ్ చేసి, ప్రతి వారం జిల్లా అధికారుల పరిశీలనకు పంపాలని జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా స్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని, తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు తెలియపర్చాల్సి ఉంది.

కమాండ్ కంట్రోల్ రూమ్ వివరాలు

ఉదయం షిఫ్ట్ (ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు)

- టి. ఉమాదేవి, ఏవో జీఎస్‌డబ్ల్యూఎస్, సెల్: 80964 71000
- షేక్ కరీముద్దీన్, డీఆర్పీ, డీపీఆర్పీ, సెల్: 98492 28176

రాత్రి షిఫ్ట్ (రాత్రి 10 నుంచి ఉదయం 10 వరకు)

- ఎస్. నిరంజన్‌రావు, డీఆర్పీ, డీపీఆర్పీ, సెల్: 94415 36979
- కె. అనురాధ, డీఆర్పీ, డీపీఆర్పీ, సెల్: 91107 12139

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రతిపాదనలకు కమిటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు సంబంధించిన ప్రతిపాదనలు స్వీకరించేందుకు మండల, డివిజన్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. కలెక్టరేట్ వద్ద ఉన్న డీఈఓ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 5న జరగనున్న గురుపూజోత్సవంలో భాగంగా 2024 సంవత్సరానికి రాష్ట్ర స్థాయి అవార్డులతోపాటు ఎస్ఎఫ్‌టీడబ్ల్యూ అవార్డులకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించేందుకు తుది గడువు ఆగస్టు 5న ముగియనుందని స్పష్టం చేశారు. గడువు ముగిసిన తరువాత ఎటువంటి దఖాస్తులు అనుతింపబడవని చెప్పారు.

నిలువునా నరికి వేలాడదీస్తా

- కేబుల్ ఆపరేటర్, టెక్నీషియన్‌కు టీడీపీ కౌన్సిలర్ బెదిరింపులు
- రక్షణ కల్పించాలని సబ్‌కలెక్టర్‌కు బాధితుల వేడుకోలు



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన చంద్రశేఖర్, కృష్ణకాంత్

తెనాలి: కేబుల్ టీవీ కనెక్షన్ల విషయంలో తమను బెదిరిస్తున్న టీడీపీకి చెందిన 19వ వార్డు కౌన్సిలరు పసుపులేటి త్రిమూర్తి నుంచి రక్షణ కల్పించాలంటూ పట్టణ 20వ వార్డుకు చెందిన కేబుల్ ఆపరేటర్ తలశిల చంద్రశేఖర్, టెక్నీషియన్ కంచర్ల కృష్ణకాంత్ సోమవారం తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల క్రితం పట్టణంలోకి వచ్చిన ఎస్ చానల్ నెట్‌వర్క్‌కు కేబుల్ ఆపరేటర్లు మారారని, గత జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం 19వ వార్డు కౌన్సిలర్, కేబుల్ ఆపరేటరైన పసుపులేటి త్రిమూర్తి పాత చానల్‌తో కుమ్మక్కై, ఆపరేటర్లందరికీ ఫోన్లు చేసి ఆ చానల్‌కు మారాలని బెదిరిస్తున్నారని సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. తాము మాట వినలేదని కక్ష గట్టిన త్రిమూర్తి గత ఆదివారం ఫోన్ చేసి, 'నిన్ను, మీ ఆపరేటర్ని నిలువునా నరికి మా షాప్‌కు వేలాడదీస్తాను.. ఎవరు అడ్డుకుంటారో చూస్తాను.. ఎవరు బతికిస్తారో చూస్తాను. మిమ్మల్ని, మీ నెట్‌వర్క్‌ను లేకుండా చేస్తాను' అంటూ బెదిరించాడని టెక్నీషియన్ కృష్ణకాంత్ వివరించారు. అప్పుడు దుగ్గిరాలలో ఉన్న తాను భయపడి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో తలదాచుకున్నానని చెప్పారు. సుమారు 12 మంది రెండు కార్లలో తన కోసం దుగ్గిరాల వచ్చారని పేర్కొన్నారు. తనను దుగ్గిరాల ఎస్ఐ ఇద్దరు పోలీసుల రక్షణతో అదేరోజు సాయంత్రం తెనాలి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వదిలిపెట్టారని వెల్లడించారు. త్రీటౌన్ పోలీసుల సూచనతో వన్‌టౌన్ స్టేషనుకు వెళ్లి ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. త్రిమూర్తి టీడీపీ కౌన్సిలర్ కావడంతో చర్యలకు పోలీసులు వెనుకాడుతున్నారేమోనని, తమకు రక్షణ కల్పించాలని సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు.

క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌పై సదస్సు



ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర బడ్జెట్ 2024–25పై సదస్సు జరిగింది. విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శివరామ్ ప్రసాద్ ఈ సదస్సులో అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో కేంద్ర బడ్జెట్ అత్యంత ప్రాముఖ్యం సంతరించుకుందని ఆర్థికాభివృద్ధి, ఉపాధి, పెట్టుబడులకు, అంతర్జాతీయ వ్యాపారంలో పురోభివృద్ధి సాధించేందుకు ఈ బడ్జెట్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ అనుకూలంగా ఉందన్నారు. ముఖ్య అతిథి యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగ అధ్యాపకులు ఆచార్య సీఎస్ఎన్ రాజు పలు రకాల లోటు బడ్జెట్‌ల గురించి వివరిస్తూ ద్రవ్య లోటు 4.9 శాతానికి తగ్గించడం మంచి పరిణామం అన్నారు. వస్తువులు, స్వల్ప దీర్ఘకాల మూలధన, ఆదాయాలపై పన్నును సమర్థించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,700, గరిష్ట ధర రూ.4,000, మోడల్ ధర రూ.3,500 వరకు పలికింది.

ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తాం

- అర్జీలన్నింటినీ పరిశీలించి న్యాయం చేస్తాం
- ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో ఎస్పీ సతీష్‌కుమార్



ఓ బాధితురాలితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో సోమారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఎస్పీ సతీష్‌కుమార్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను సావధానంగా విన్నారు. కేసులపై పోలీస్‌స్టేషన్ల సీఐలతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం) పాల్గొన్నారు.

అప్పు ఎగ్గొట్టాడు.. న్యాయం చేయండి

ఏడాది క్రితం తెలిసిన వ్యక్తికి రూ.2.50 లక్షలు అప్పుగా ఇచ్చాను. అదీగాక రెండు సవర్ల బంగారు గొలుసు కూడా తనఖా పెట్టాడు. ప్రస్తుతం డబ్బులు అడిగితే చెల్లించడంలేదు. ప్రస్తుతం కనిగిరి పెదవీర్లపాడులో ఉంటున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇబ్బందులకు గురవుతున్నా. న్యాయం చేయగలరు. – దివ్యాంగుడు డి.కృష్ణారెడ్డి, సాయినగర్, స్తంభాలగరువు

అధిక వడ్డీ ఆశ చూపి..

వ్యవసాయ కూలి పనులకు వెళ్తుంటాం. స్థానికంగా ఉండే ఓ వ్యక్తి అధిక వడ్డీ ఆశచూపి, తమ వద్ద రూ.30 వేల నుంచి రూ.లక్షల్లో తీసుకున్నాడు. వడ్డీ, అసలు విషయమై అడిగితే కాలయాపన చేసేవాడు. చాలా మందికి ప్రామిసరీ నోట్లు రాసిచ్చాడు. స్థానికంగా ఉంటున్న సదరు వ్యక్తి ఇటీవల కనిపించడంలేదు. అతని కుటుంబ సభ్యులను ఆరాతీస్తే సరైన సమాధానంలేదు. కూలీ పనులు చేసుకుని సంపాదించిన సొమ్ము కూడబెట్టుకుని అతనికి చెల్లించాం. సుమారు రూ.80 లక్షలతో ఉడాయించాడు. అతని ఆచూకీ గుర్తించి, న్యాయం చేయగలరు.

– బాధితులు హరిప్రసాద్, కామేశ్వరమ్మ, మల్లేశ్వరరావు, ఎస్.శివకోటేశ్వరరావు తదితరులు, అత్తోట యాదవపాలెం గ్రామం, కొల్లిపర మండలం

ఎక్కువగా వచ్చే సమస్యలపై ప్రత్యేక దృష్టి

- త్వరలో మిగతా సబ్ డివిజన్లలోనూ ప్రత్యేక డ్రైవ్
- రేస్‌లు, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి
- ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో ఎక్కువగా వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో సోమవారం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఒకటిరెండు వారాలపాటు ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో ఏ సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయనేది పరిశీలిస్తామని, ఒకవేళ పదే పదే అవే సమస్యలు వస్తే, వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారానికి చర్యలు చేపడతామని వెల్లడించారు. ఇక మహిళల చట్టాలపై, న్యాయపరమైన సలహాలపై వనితలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఆదివారం రాత్రి గుంటూరు పశ్చిమ పరిధిలో పోలీస్ బృందాలతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని, చిన్నారులు ఎక్కువగా మోటారుసైకిళ్లు నడపడం కనిపించిందని చెప్పారు. చోరీలు, మద్యం మత్తులో, ఇష్టానుసారంగా వాహనాలు నడపడం, రేస్‌లు, గంజాయి మత్తులో వాహనాలు నడపడాన్ని అరికట్టడమే డ్రైవ్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఆర్టీఓ శాఖ సమన్వయంతో ఈ డ్రైవ్ చేపట్టామని, ప్రత్యేక డ్రైవ్‌కు పది ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. దీనికోసం ఏఎస్పీ స్థాయి పోలీస్ అధికారి నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారని, 160 పోలీస్ సిబ్బంది డ్రైవ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి చేపట్టిన నాకాబందీలో 286 వాహనాలను సీజ్ చేయగా 98 వాహనాలకు రూ.5,26,900 చలానా, డ్రంక్ అండ్ డ్రైవింగ్ కింద 12 వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ డ్రైవ్ గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్, నల్లపాడు పీఎస్ పరిధిలో జరగ్గా త్వరలో మిగతా పోలీస్ సబ్ డివిజన్లలోనూ నిర్వహిస్తామని ఎస్పీ చెప్పారు. గంజాయి నిర్మూలనకు కార్డెన్ సెర్చ్ చేపట్టనున్నట్టు వెల్లడించారు.

కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి అధ్యక్షునిగా కంకణాల వెంకట సుధీర్, కార్యదర్శిగా డాక్టర్ దొడ్డక శివరామకృష్ణ, కోశాధికారిగా లంకపల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం, సయ్యద్ అనీషా బేగం, జాయింట్ సెక్రటరీస్‌గా ఎం.శిరీష, జి.రజిత, ఎల్.సౌమ్య కార్యవర్గ సభ్యులుగా యు.అన్నామణి, జి.శాంతరాజు, ఎ. మణి, కె.కిషోర్. ఎం.అన్నపూర్ణాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గానికి గౌరవ అధ్యక్ష, కార్యదర్శులుగా వికాస అధ్యక్షుడు టి. అనిల్ కుమార్, కార్యదర్శి కె శ్రీనివాసరావు సలహాదారులుగా కోడూరి కనకరాజు, అజయ్‌బాబు వ్యవహరిస్తారని నూతన కార్యవర్గ నాయకులు తెలిపారు.

రైతు శ్రేయస్సే నాబార్డు ధ్యేయం

నాబార్డ్ జిల్లా డీడీఎం శరత్



గుంటూరు రూరల్: రైతుల శ్రేయస్సు కోసం నాబార్డ్ ఎల్లప్పుడూ ముందుంటుందని నాబార్డ్ డీడీఎం శరత్ తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతోపాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు అంశాలపై రైతు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శరత్ మాట్లాడుతూ నాబార్డు నుంచి రైతులకు వివిధ పథకాల ద్వారా రాయితీలను ఇస్తున్నట్టు వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, గోడౌన్‌లు, కోల్డ్‌స్టోరేజీల నిర్మాణానికి భారీగా రాయితీలు అందిస్తున్నట్టు వెల్లడించారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన


హార్టికల్చర్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, డెప్యూడి డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు పూర్తి సేంద్రియ పద్ధతులతో సాగు చేసే విధానాలను, సాగుకు వివిధ రకాల కషాయాలు, ద్రావణాల తయారీ గురించి వివరించారు. సేంద్రియ సాగును లాభాల బాటలో నడిపించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. సేంద్రియ రైతు మీసాల రామకృష్ణ మాట్లాడుతూ జామ సేంద్రియ సాగు గురించి వివరించారు. రైతు శబరీనాథ్ సేంద్రియ సేద్యంలో తన అనుభవాలను పంచుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు, వివిధ యంత్ర పరికరాల ధరలు తదితర అంశాలను రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణకు హాజరైన రైతులకు సిరిధాన్యాల సాగు పుస్తకాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో రైతునేస్తం పౌండేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ చైర్ కార్యాలయం మార్పుపై హర్షం



వీసీ గంగాధరరావుకు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలుపుతున్న జగ్జీవన్‌రామ్ చైర్ డైరెక్టర్ రత్నాకర్, సిబ్బంది

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం (చైర్) కార్యాలయం పాత ఎస్‌బీఐ భవనంలోకి మార్చడం పట్ల చైర్ డైరెక్టర్, సిబ్బంది, ఎంఎస్ఎఫ్ పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. చైర్ డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు సోమవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్, ఎంఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రానికి 2018లో అప్పటి అధికారులు పాత ఎస్‌బీఐ కార్యాలయంలో అన్ని వసతులతో కార్యాలయాన్ని కేటాయించారని, ఢిల్లీలోని జగ్జీవన్ రామ్ ఫౌండేషన్‌తో ఎంఓయూ కూడా ఖరారు చేశారన్నారు. తరువాత యూనివర్సిటీలో పదవులు పొందిన ఉన్నతాధికారులు, అధ్యయనకేంద్రం అధికారులు అధ్యయనకేంద్రాన్ని ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేశారన్నారు. చైర్ కార్యాలయాన్ని చిన్న గదుల్లో మార్చడంతోపాటు అనేక కుట్రలు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం పదవుల్లోకి వచ్చిన అధికారులు సమస్యలను పరిగణంలోకి తీసుకుని వెంటనే పాత భవనంలోకి కార్యాలయాన్ని మార్చడంతోపాటు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. త్వరలో అధ్యయనకేంద్రం ఆధ్వర్యంలో సదస్సులు, శిక్షణ, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఫౌండేషన్‌తో ఎంఓయూ పునరుద్ధరిస్తామని తెలిపారు. ఉన్నతాధికారులను కలిసిన వారిలో డాక్టర్ సీహెచ్ ఇశ్రాయేలు, డాక్టర్ ఎస్ రాజశేఖర్, వై రాజేష్, శ్రీను, సునీల్, ఆలీ భాషా, దిలీప్, నరేంద్ర, సాల్మన్‌రాజు, బద్రి, ఆదామ్, జకరయ్య తదితరులు ఉన్నారు.



వెల్లివిరిసిన సాంస్కృతిక సౌరభం

- మహాకవి గుర్రం జాషువా పద్యగానం, కవితాలాపన
- వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాల ప్రదానం



'ఫిరదౌసి' ఏకపాత్రలో డాక్టర్ పెద్దీటి యోహాను



జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులకు సత్కారం

తెనాలి: దుగ్గిరాలలోని గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ 36వ వార్షికోత్సవం, జాషువా వర్ధంతి కార్యక్రమాలు తెనాలిలో ఆదివారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి పొద్దుపోయేవరకు వివిధ సాంస్కృతిక, సత్కార కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి డాక్టర్ రంగిశెట్టి రమేష్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్య కవి సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయి కవి సమ్మేళనం సాగింది. ఎందరో కవులు తమ కవితలను చదివారు. సాయంత్రం నాలుగు గంటలకు జాషువా పద్యపఠనం జరిగింది. జి.ఎస్.రాజు, డి.అనిల్‌కుమార్ నిర్వహణలో జరిగిన పద్యపఠనానికి అవిశ యోహాను హార్మోనియంపై సహకారం అందించారు. సాయంత్రం ఎ.గగనశ్రీ, పి.లౌఖ్యశ్రీల కూచిపూడి నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం సినీగీతాలను ఆలపించారు. ఈమని శ్రీనివాసరావు, ఆర్.జాకబ్‌లు సంగీత సహకారం అందించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి మహాకవి జాషువా రచించిన పిరదౌసి ఏకపాత్రను 'అభినవ జాషువ' డాక్టర్ పి.యోహాను అభినయించారు. తదుపరి సత్యహరిశ్చంద్ర ఏకపాత్రను జాషువా పద్యాలతో పి.ఫ్రాన్సిస్ ప్రసాద్ అభినయించారు. రాత్రి ఏడు గంటల్నుంచి మహాకవి జాషువా 53వ వర్ధంతి, సంస్థ 36వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. అంతర్జాతీయ జాషువా కళాపరిషత్ చైర్మన్ డాక్టర్ పెద్దీటి యోహాను అధ్యక్షత వహించారు. ఉత్తమ సేవాదంపతులుగా గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా, కత్తెర సురేష్‌కుమార్‌ను సత్కరించారు. జీసీ రామలింగారెడ్డి (బెంగళూరు), నగేష్ దేవరకొండ (హనుమకొండ), నట్టవ హరగోపాల్ (గుంటూరు), రఘుపాత్రుని గనేశ్వర బాబ్జి (విశాఖపట్నం)కు గౌరవ డాక్టరేట్స్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ గంగిశెట్టి రమేష్‌కు పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను బహూకరించారు. మహాకవి జాషువ జీవిత సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ పి.బాబూరావు (వరంగల్)కు అందజేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 11 మందికి మహాకవి జాషువా పురస్కారాలను ప్రదానం చేశారు. జి.విజయరావ్ స్వాగతం పలికిన సభలో కళాపరిషత్ సంయుక్త కార్యదర్శి జీఎస్ రాజు, అక్షయ సాంస్కృతిక సేవాసమితి దుగ్గిరాల అధ్యక్షులు వి.మేరిసుజాత, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, ఆలిండియా హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ ఏపీ కార్యదర్శి జీసీ రామలింగారెడ్డి, డాక్టర్ యూవీ రత్నం, డాక్టర్ కాటూరి ప్రభుదాస్, సీహెచ్ జాన్‌సుందరరావు, జుజ్జువరపు న్యూటన్, కార్యదర్శి వి.ప్రకాశరావు మాట్లాడారు.

రీజినల్ అథ్లెటిక్ మీట్‌లో తెనాలి కేవీ పతకాల వేట



పతకాలు సాధించిన విద్యార్థులతో శ్రీకాంత్, రవికుమార్, అజయ్

తెనాలి: కేంద్రియ విద్యాలయ సంఘటన్, హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీజినల్ అథ్లెటిక్ మీట్–2024లో కేంద్రియ విద్యాలయం, జగ్గడిగుంటపాలెం, తెనాలికి చెందిన విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలను సాధించారు. కేంద్రియ విద్యాలయ, తెనాలి ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు. కేంద్రియ విద్యాలయ, గోల్కొండ–1012కు సంబంధించిన ఆర్మీ, ఆర్టిలరీ స్టేడియంలో ఈనెల 25–27 తేదీల్లో ఈ పోటీలు జరిగాయని తెలిపారు. తమ విద్యార్థులు మొత్తం 21 మంది పాల్గొనగా, వీరిలో పదోతరగతి విద్యార్థి సయ్యద్ రాఫియా (అండర్17) 100 మీటర్లు, 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకాలను సాధించినట్టు తెలిపారు. 9వ తరగతి విద్యార్థినులు వంగర గాయత్రి హైజంప్‌లో, కె.తత్రోనా ట్రిపుల్‌జంప్‌లో బంగారు పతకాలను సాధించారు. 12వ తరగతి విద్యార్థిని రహనుమా (అండర్19) 100 మీటర్ల హర్డిల్స్‌లో, 80 మీటర్లు, 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. 8వ తరగతి విద్యార్థి డి.కార్తికేయ 80 మీటర్ల హర్డిల్స్‌లో రజతం, 7వ తరగతి విద్యార్థిని యు.అక్షర లాంగ్‌జంప్‌లో రజతం, 9వ తరగతి విద్యార్థిని డి.రిషిత డిస్కస్‌త్రోలో కాంస్య పతకాలను సాధించారు. 4+100 మీటర్ల రిలేలో సయ్యద్ రాఫియా, పి.సంకీర్తన, బి.నమ్రత, ఐ.రాధమ్మ రజత పతకం, 4+400 మీటర్ల రిలేలో జి.శాంతిసుజన, సయ్యద్ రాఫియా, బి.నమ్రత, ఐ.గాయత్రి కాంస్యాన్ని సాధించారు. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు ఎర్నాకులంలో జరిగే కేంద్రీయ విద్యాలయ జాతీయ క్రీడలకు తమ విద్యార్థులు సయ్యద్ రాఫియా, వి.గాయత్రి ఎంపికైనట్టు వివరించారు. వీరికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రవికుమార్, కోచ్ డి.అజయ్‌ను అభినందించారు.

పారిశుధ్య కార్మికురాలి ఆత్మహత్యాయత్నం

లైంగిక వేధింపులే కారణమా?

పొన్నూరు: పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు..గుంటూరు జిల్లా పొన్నూరు పురపాలక సంఘం ఉన్నతాధికారి నివాసంలో పారిశుధ్య కార్మికురాలు ఏడాది కాలంగా పనిచేస్తోంది. ఆమె కొంతకాలంగా అధికారి లైంగిక వేధింపులకు గురైనట్లు సమాచారం. వేధింపులకు తట్టుకోలేక పది రోజుల కిందట ఆ అధికారి నివాసంలో పనికి వెళ్లేందుకు ఆమె నిరాకరించింది. మూడు రోజుల కిందట ఆమె ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆయన గతంలోనూ విధులు నిర్వహించిన వేరే ప్రాంతంలో కూడా పారిశుధ్య కార్మికుల నుంచి లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ కలహాల నేపథ్యంలో కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. ఆమె గతంలో మున్సిపల్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ కమిషనర్ నివాసంలో పనిచేసినట్లు పేర్కొన్నారు.

పసికందు మృతిపై తల్లిదండ్రుల ఆందోళన

జీజీహెచ్ ప్రసూతి వార్డులో ఘటన



తల్లి ఒడిలో మృతిచెందిన పసికందు

గుంటూరు ఈస్ట్: అప్పుడే పుట్టిన పసికందు మృతి చెందడం పట్ల తల్లిదండ్రులు గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. పసికందు తండ్రి రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకుమాను మండలం చినలింగాయపాలెంకు చెందిన కోనూరు రాజేష్, భాగ్యలక్ష్మి దంపతులకు రెండో కాన్పు. తొమ్మిదో నెల కావడంతో 15 రోజుల కిందట గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చేరింది. భాగ్యలక్ష్మికి బీపీ ఎక్కువగా ఉండటంతో వైద్యులు చికిత్స అందించారు. వైద్యులు స్కానింగ్, ఇతర పరీక్షలు చేసి గర్భంలో శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. సోమవారం వైద్యులు భాగ్యలక్ష్మికి ఆపరేషన్ చేశారు. భాగ్యలక్ష్మికి మగ శిశువు జన్మించాడు. కొన్ని గంటల్లోనే శిశువు మృతిచెందినట్లు చెప్పి వైద్యులు మృత శిశువును అప్పగించారు. శిశువు చేతికి ఇంజక్షన్ పెట్టి ఉంది. దీనిని బట్టి పసికందుకు వైద్యులు చికిత్స చేసినట్లు తెలుస్తుంది. అన్ని పరీక్షల్లో శిశువు ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పిన వైద్యులు, పుట్టిన తరువాత ఏ ఆరోగ్య సమస్య వచ్చింది చెప్పకుండా దాటేస్తున్నారని రాజేష్ కన్నీటి పర్యంతమయ్యాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తనకు పుట్టిన బిడ్డ మృతిచెందాడని కన్నీంటి పర్యంతమయ్యాడు. దీనిపై జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను వివరణ అడుగ్గా, తనకు పూర్తి సమాచారం ఇవ్వలేదని చెప్పారు.

ప్రకృతి సేద్యం ఉద్యోగుల జీతాలు చెల్లించాలి

గోరంట్లలోని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం విభాగం ఉద్యోగులు



రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు రూరల్: ప్రకృతి సేద్య విభాగం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో 16 నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు గోరంట్లలోని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకృతి సేద్య ఉద్యోగుల పోరాటానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఫోరం తరఫున మద్దతు తెలుపుతున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణమూర్తి కె.హరిబాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్వీ నరసింహారావు తదితరులు మాట్లాడారు. ధర్నా అనంతరం రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావుకు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. స్పందించిన సీఈఓ జీతాలు విడతల వారీగా చెల్లించేందుకు అంగీకారం తెలిపారు. ఉద్యోగులు దిగువ స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో ఒక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఉద్యోగులు గోరంట్ల వేంకటేశ్వరస్వామి దేవస్థానం సెంటర్ నుంచి రైతు సాధికారిక సంస్థ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, వరప్రసాద్, సీఐటీయూ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ కేసులో మరో నిందితుడు అరెస్ట్

నరసరావుపేట టౌన్: ఎన్‌సీసీ విద్యార్థిపై దాడి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల వసతి గృహంలో జూనియర్ ఎన్‌సీసీ క్యాడెట్‌పై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో పైశాచికంగా దాడికి పాల్పడిన సంఘటన విధితమే. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయగా ఆరవ నిందితుడు అజయ్‌ను తాజాగా అరెస్ట్ చేశారు.